క్లుప్తంగా

ఉత్సవాలకు ఆలయం ముస్తాబు



ముస్తాబైన ఆలయం

కొందుర్గు: ప్రతి ఏడాది ఉగాది, దసరా పండగలకు కొందుర్గు లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, అక్కడి నుంచి స్వామివారిని పల్లకీసేవతో పెండ్యాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నిర్వాహకులు స్వామివారి ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉగాది పండగ సందర్భంగా మంగళవారం ఉదయం ఆలయంలో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఈఓ శ్రీనివాసశర్మ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు పల్లకీసేవ, 7 గంటలకు పంచాగ శ్రవణం కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చేవెళ్ల: ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేశ్‌బాబు తెలిపారు. శంకర్‌పల్లిలో సోమవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ గోదాం వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీఎంఎస్ గోదాం ఇన్‌చార్జి శివారెడ్డి, ఏఈఓలు రమ్య, సుశీలతో కలిసి ప్రారంభించారు. రైతులు ఈ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

చేవెళ్ల: ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో ఏదైనా సాధించేందుకు అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పట్నం మహేందర్‌రెడ్డి వైద్య కళాశాల డీన్ డాక్టర్ పి.వి.సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో 2024 ప్రపంచ ఆరోగ్య సంస్థ 76వ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా నా ఆరోగ్యం, నా హక్కు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం థీమ్‌గా తీసుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాలతో పాటు ఆలూరు ప్రాథమిక వైద్య కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలోని ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలను అందించేందుకు పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రి అందుబాటులో ఉందని తెలిపారు. మెడికల్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకొని వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ఆలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కమ్యూనిటీ మెడిసిన్, డాక్టర్ రాజేశ్వర్‌రావు, డాక్టర్ ప్రియాంక, జి.బ్రహ్మాచారి, వైద్యబృందం తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

షాద్‌నగర్‌రూరల్: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ బన్సిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ.. కూలీలకు పెండింగ్‌లో ఉన్న 9 నెలల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూలీలకు కనీస సౌకర్యాలను కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశంలో ఫొటో తీసే విధానాన్ని రద్దు చేయాలని, కొలతలు లేకుండా రోజుకు రూ.800 కూలీ ఇవ్వాలని పేర్కొన్నారు. పని ప్రదేశంలో నేల గట్టిగా ఉంటే తేలికపాటి పనులను కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, ఎల్లయ్య, లింగమ్మ, పవన్ పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు



ఉగాది పచ్చడి తయారు చేస్తున్న విద్యార్థులు

షాద్‌నగర్: పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో గల కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ రఫత్‌సుల్తానా ఆధ్వర్యంలో సోమవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను ధరించి ఉగాది వేడుకలలో పాల్గొన్నారు. ఉగాది పచ్చడిని తయారు చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. ప్రిన్సిపాల్ రఫత్‌సుల్తానా ఉగాది పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు.

‘లక్ష’ణంగా వదిలేశారు

- నిరుపయోగంగా మారిన ప్రభుత్వ భవనాలు
- లక్షల రూపాయల ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు



సురంగల్‌లో అంగన్‌వాడీ భవనం



మొయినాబాద్‌లో నిరుపయోగంగా ఉన్న బీసీ బాలికల హాస్టల్ భవనం

మొయినాబాద్: లక్షల రూపాయలు ప్రజాధనం ఖర్చుచేసి నిర్మించిన ప్రభుత్వ భవనాలు వృథాగా మారాయి. భవనాలను అనువైన చోట నిర్మించకపోవడంతో పాటు కనీసం ఇతర అవసరాలకు కూడా వాడకపోవడంతో అవి నిరుపయోగంగా మిగిలిపోయాయి. విద్యార్థులకు ఉపయోగపడేలా నిర్మించాల్సిన భవనాలను అనాలోచితంగా ఎక్కడపడితే అక్కడ నిర్మించారు. నిరుపయోగంగా మారిన భవనాలు ఇలా..

మండల కేంద్రంలో..

మొయినాబాద్ మండల కేంద్రంలో బీసీ బాలికల వసతి గృహం భవనాన్ని పదిహేనేళ్ల క్రితం రూ.40 లక్షలు ఖర్చుచేసి నిర్మించారు. అయితే జనావాసాలకు దూరంగా శ్మశానవాటిక పక్కన హాస్టల్ భవనం నిర్మించడంతో విద్యార్థినులు అందులోకి వెళ్లేందుకు భయాందోళన చెందారు. దీంతో అప్పటి నుంచి వృథాగా వదిలేయడంతో ఆ భవనం బూత్‌బంగ్లాలా మారింది. ప్రస్తుతం ఆ భవనం తలుపులు, కిటికీలకు ఉన్న ఇనుప గ్రిల్స్‌ను గుర్తు తెలి యని దుండగులు ఎత్తుకెళ్లారు. ఎనిమిదేళ్ల క్రితమే మొయినాబాద్‌లో బీసీ బాలికల హాస్టల్‌ను ప్రభుత్వం పూర్తిగా ఎత్తేసింది. ఇక హాస్టల్ కోసం నిర్మించిన భవనాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు.

పెద్దమంగళారంలో..

మండల పరిధిలోని పెద్ద మంగళారంలో ఎస్సీ బాలుర వసతి గృహం కోసం నిర్మించిన భవనం వృథాగా మారింది. ఎనిమిదేళ్ల క్రితం హాస్టల్ మూతపడటంతో ఆ భవనాన్ని వృథాగా వదిలేశారు. కొంత కాలం పాటు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను అందులో నిర్వహించి భవనం సరిపోవడం లేదని ప్రైవేటు భవనంలోకి గురుకులాన్ని మార్చారు. దీంతో ఆ భవనం ప్రస్తుతం వృథాగా మారింది.

హిమాయత్‌నగర్‌లో..

మండలంలోని హిమాయత్‌నగర్‌లో 15 సంవత్సరాల క్రితం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కోసం మూడు అదనపు గదులను సుమారు రూ.10లక్షల నిధులతో పాఠశాలకు దూరంగా నిర్మించారు. పాఠశాలకు దూరంగా ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆ గదుల్లోకి వెళ్లలేని పరిస్థితి రావడంతో వాటిని నిరుపయోగంగా వదిలేశారు. అందులో ఒక గదిని మాత్రం ప్రస్తుతం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరఫి చేసేందుకు ఉపయోగిస్తున్నారు.

సురంగల్‌లో..

మండలంలోని సురంగల్ గ్రామంలో పన్నెండేళ్ల క్రితం రూ.5లక్షలతో అంగన్‌వాడీ భవనాన్ని సైతం ఇదే తరహాలో అనాలోచితంగా నిర్మించారు. అంగన్‌వాడీ భవనం గ్రామంలో నిర్మించాల్సి ఉండగా గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్న కాలనీలో నిర్మించారు. చిన్నారులు అంతదూరం నడిచి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో భవనాన్ని వృథాగా వదిలేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకే ఇలా అనాలోచితంగా భవనాలు నిర్మించి వదిలేశారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

“ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



పెద్దమంగళారంలో ఉన్న ఎస్సీ హాస్టల్ భవన సముదాయాన్ని నర్సరీ పెంచడానికి ఉపయోగిస్తున్నాం. మొయినాబాద్‌లోని బీసీ హాస్టల్ భవనం, సురంగల్‌లోని అంగన్‌వాడీ భవనాల విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి వినియోగంలోకి తెచ్చే ప్రయత్నం చేస్తాం.

–సంధ్య, ఎంపీడీఓ, మొయినాబాద్

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కరపత్రం విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, తదితరులు

షాద్‌నగర్: భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవిత చరిత్ర కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై అంబేడ్కర్ జీవిత చరిత్ర కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో నెలకొన్న అసమానతల నిర్మూలకు అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. సమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేశ్, జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా ఉపాధ్యాక్షుడు సుబ్రమణ్యం, శ్రీనివాస్, గణేశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలి



పీజీ కళాశాలలో ఉగాది వేడుకలు

మొయినాబాద్: విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో సోమవారం ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉగాది పచ్చడి తయారీపై పోటీలు నిర్వహించారు. విద్యార్థులు గ్రూపులుగా షడ్రుచుల ఉగాది పచ్చడిని తయారు చేశారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన పండగలు, ఉత్సవాలు, సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పండగ విశిష్టతను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మల్లారెడ్డి, సురేశ్, దీప్తి, శ్వేత, కనకారావు, కిశోర్, జ్యోతికసోని పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

పీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న సురేందర్‌రెడ్డి, ముస్లింలు

షాబాద్: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని నాగర్‌గూడ పీఎస్ఆర్ గార్డెన్, తిర్మలాపూర్ దర్గాల్లో మైనార్టీలకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ఐకమత్యానికి, మత సామరస్యానికి చిహ్నంగా నిలుస్తాయన్నారు. సర్వ మత సారం ఒక్కటేనని, మానవులంతా సోదరభావంతో ఉండాలని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. మైనార్టీలకు అండగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి పథకాలు ప్రారంభించిందని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మల్లేశ్, నాయకులు భార్గవ్‌రాం, రవీందర్, అక్తర్‌పాషా, శేఖర్, శ్రీరాంరెడ్డి, రాహుల్‌గుప్తా, చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, యాదగిరి, పామెన నర్సింలు, సత్యం, భందయ్య, గడ్డం చంద్రయ్య తదితరులు ఉన్నారు.

నియామకం

చేవెళ్ల: ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోషియేషన్(ఎంఈపీఏ) జిల్లా ప్రధాన కార్యదర్శిగా చామంతి కృష్ణముదిరాజ్ నియామకమయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మెపా(ఎంఈపీఏ) కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్‌ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బి.సంజీవన్ కుమార్, గౌరవాధ్యక్షుడు డాక్టర్ బోయిని జగన్‌మోహన్‌ల ఆధ్వర్యంలో మల్కాపూర్ గ్రామానికి చెందిన చామంతి కృష్ణముదిరాజ్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా సోమవారం కృష్ణముదిరాజ్ విలేకరులతో మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల అభివృద్ధి, ఐక్యత కోసం అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తానని చెప్పారు. పూర్తిస్థాయిలో మెపా కార్యక్రమాల్లో పాల్గొంటూ సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. తనపై ఎంతో నమ్మకంతో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసిన మెపా రాష్ట్ర, జిల్లా సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

షాద్‌నగర్‌కు రెండో అగ్నిమాపక వాహనం

ఫైర్ సర్వీసెస్ శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్‌కు రెండో అగ్నిమాపక వాహనం మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విపత్తు, నిర్వహణ, ఫైర్ సర్వీసెస్‌శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వెంటనే స్పందించిన నాగిరెడ్డి అగ్నిమాపక వాహనాన్ని మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అగ్నిమాపక కేంద్రం అభివృద్ధికి సొంత భవనం కావాలని, సిబ్బంది కొరత లేకుండా చూడాలని ఎమ్మెల్యే కోరారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అగ్నిమాపక కేంద్రంలో సిబ్బంది సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. షాద్‌నగర్‌కు రెండు వాహనాలు, డబుల్ యూనిట్ గ్యారేజ్ నిర్మాణం, 3 ఫేజ్ బోరు సౌకర్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే వినతి మేరకు విపత్తు, నిర్వహణ, ఫైర్ సర్వీసెస్‌శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి స్పందించి సిబ్బంది సమస్యలను పరిష్కరించి మరొక అగ్నిమాపక వాహనాన్ని మంజూరు చేస్తానన్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు.

మహబూబ్‌నగర్ బీజేపీ సహ ఇన్‌చార్జిగా మోహన్‌సింగ్

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల బీజేపీ ఎస్టీ మోర్చా సహ ఇన్‌చార్జిగా నియోజకవర్గానికి చెందిన మోహన్‌సింగ్ నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి డీకె.అరుణ, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్‌కు మోహన్‌సింగ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. బీజేపీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి కేంద్రంలో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డిదే గెలుపు

బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నితీశ్‌రెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం ఖాయమని బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నితీశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అల్లాడ శ్రీనివాస్‌రెడ్డి, దళిత మోర్చా మండల అధ్యక్షుడు అశోక్, బీజేపీ కో–కన్వీనర్ సింగపురం రమేశ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ భారత దేశాభివృద్ధి పీఎం మోదీతోనే సాధ్యమవుతుందని చెప్పారు. గత 10 ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో చేయలేని అభివృద్ధి చేసి చూపించిందని విమర్శించారు. కేంద్రం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తే అందరూ మోదీకే జై కొడుతున్నారన్నారు. చేవెళ్ల నుంచి పోటీ చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మోజార్టీతో గెలిపించి మోదీకి కానుకగా ఇస్తామన్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ప్రతీ ఓటరును కలిసి బీజేపీని గెలిపించే విధంగా శ్రేణులు పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

నిలిచిన తైబజార్ వేలం

- మున్సిపాలిటీ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు



కొత్తూరు మున్సిపల్ కార్యాలయం

కొత్తూరు: మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రతి ఏటా ఆయా రకాల పథకాల నుంచి నిధులను మంజూరు చేస్తోంది. ఇలా ప్రభుత్వం నుంచి వచ్చే నిధులే కాకుండా పంచాయతీలు, మున్సిపాలిటీలు తమ పరిధిలో ఉన్న ఇళ్లు, వ్యాపార సముదాయాలు, తైబజార్‌తో పాటు పలు మార్గాల ద్వారా సొంతంగా నిధులు సమీకరించుకోవాలని ఉన్నతాధికారులు ఆయా సమావేశాల్లో అధికారులకు దిశానిర్దేశం చేస్తుంటారు. సొంతంగా ఆదాయ వనరులను సృష్టించుకుంటే కొంతవరకు పాలనలో మున్సిపాలిటీలు, పంచాయతీల కు ఆర్థికభారం తగ్గుతుంది. అవకాశం ఉన్నా ఆయా కారణాల సాకుతో కొన్ని మున్సిపాలిటీలు, మేజర్ పంచాయతీల అధికారులు, పాలకవర్గం ఆదాయ మార్గాలను సృష్టించుకోవడంపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. దీంతో కేవలం పన్నులు, ప్రభుత్వం ఇచ్చే నిధులపైనే ఆధారపడాల్సి వస్తోంది.

రెండేళ్లుగా నిలిచిన తైబజార్ వేలం..

కొత్తూరు మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడే తైబజార్ వేలం ప్రక్రియను ప్రారంభించారు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం కొత్తూరు మున్సిపాలిటీగా మారింది. మున్సిపాలిటీ ఏర్పాటయ్యాక మొదటి సంవత్సరం తైబజార్ వేలం నిర్వహించగా పదుల సంఖ్యలో టెండర్ నిర్వాహకులు పాల్గొన్నారు. అప్పట్లో ఏడాదికి గాను తైబజార్ వేలంను ఓ గుత్తేదారు రూ.5లక్షలకు దక్కించుకున్నారు. కాగా సదరు టెండర్ నిర్వాహకుడు మున్సిపాలిటీ పరిధిలోని ఆయా పరిశ్రమలకు వచ్చే లారీలు, రోడ్లపై నిలిపే వాహనాల వద్ద తైబజార్ రసీదు ఇచ్చి డబ్బులు వసూలు చేశారు. దీనిపై గుత్తేదారుకు, అధికారులు, పరిశ్రమల నిర్వాహకుల మధ్య ఇబ్బందులు ఎదురయ్యాయి. చివరగా పరిశ్రమలకు వచ్చే లారీలు, రోడ్లపై నిలిపే వాహనాలకు తైబజార్ వర్తించదనే నిబంధన పెట్టారు. పెద్దమొత్తంలో లారీలు, వాహనాల నుంచే టెండర్‌దార్లకు ఆదాయం వస్తుండడం ఆ నిబంధన కారణంగా నిలిచిపోయింది. దానికి మున్సిపాలిటీ పాలకవర్గం తైబజార్ వేలం టెండర్ సర్కారు పాట రూ.5.01లక్షలకు నిర్ణయించింది. కాగా వేలంలో టెండర్ దక్కించుకున్న పెద్దగా ఆదాయం రాదనే కారణంతో గుత్తేదారులు వేలం ప్రక్రియకు ఆసక్తి చూపడం లేదు. చివరగా మున్సిపల్ అధికారులు సర్కారువారి పాట మేరకు వేలం నిర్వహించగా అందులో పాల్గొన్న గుత్తేదారులు సర్కారు వారి పాట కంటే తక్కువ పాడారు. దీంతో అధికారులు రెండేళ్ల నుంచి తైబజార్ వేలం ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశారు.

“ పాలకవర్గంతో చర్చిస్తాం



మున్సిపాలిటీలో రెండేళ్ల నుంచి తైబజార్ వేలం ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో మున్సిపల్ పాలకవర్గం సమావేశాన్ని నిర్వహించడం కుదరదు. జూన్ తర్వాత సమావేశాన్ని ఏర్పాటు చేసి సభ్యుల సూచనతో వేలంపై నిర్ణయం తీసుకుంటాం.

– ఎస్.బాలాజీ, మున్సిపల్ కమిషనర్, కొత్తూరు

వరి సాగులో మెలకువలు పాటించాలి

ఏఓ నిషాంత్‌కుమార్



షాద్‌నగర్‌రూరల్: వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ నిషాంత్‌కుమార్, తదితరులు

షాద్‌నగర్‌రూరల్: వరి సాగులో రైతులు మెలకువలను పాటించి అధిక దిగుబడి పొందాలని మండల వ్యవసాయ అధికారి(ఏఓ) నిషాంత్‌కుమార్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కొండన్నగూడ, మేళ్లగూడ, వెంకన్నగూడ గ్రామాల్లో సోమవారం ఏఓ పర్యటించి వరి సాగును పరిశీలించారు. వరిలో కాండం తొలిచే పురుగులను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాండం తొలిచే పురుగు వ్యాపించడంతో వరి పొట్ట దశలోనే వరి కంకులు, తాలు గింజలు ఏర్పడతాయని, దీంతో వరి దిగుబడి తగ్గుతుందన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్టాప్, హైడ్రోక్లోరైడ్ గుళికలను ఎకరాకు కిలో చొప్పున వరినాట్లు వేసే సమయంలో చల్లాలని సూచించారు. వరి పంటను కీటకాల నుంచి కాపాడుకునేందుకు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు రమణారావు, నిఖిల్‌రెడ్డి, వేణునాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నివారణకు చర్యలు తీసుకోవాలి

మొయినాబాద్: వరిలో తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాగమ్మ తెలిపారు. సోమవారం మొయినాబాద్ రైతు వేదికలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. వరిలో సస్యరక్షణ చర్యలు వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వరిలో కాండం కుళ్లు తెగులు, అగ్గితెగులు, కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. కాండం కుళ్లు తెగులు నివారణకు ఒక లీటరు నీటికి ప్రోపికొనజోల్ 1 మిల్లీలీటర్ లేదా హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్ల చొప్పున మందును కలిపి పిచికారీ చేయాలన్నారు. అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 మిల్లీలీటర్లు లేదా ఐసోప్రొథైయోలిన్ 1.5 మిల్లీలీటర్లు లేదా కాసుగామైసిన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరాకు 10 కిలోల చొప్పున వేసుకోవాలన్నారు. వరి పొట్ట దశలో లీటరు నీటికి క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిచేను గట్లపై కలుపు మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడూ నివారించుకోవాలన్నారు. వరిపంట దుబ్బు చేసే దశ నుంచి అంకురం దశ వరకు పొలంలో 2 సెంటీ మీటర్ల నీరు నిలువ ఉండాలన్నారు. అంకురం దశ నుంచి పూత దశ వరకు నీటి లభ్యతను బట్టి పొలంలో 2 సెంటీ మీటర్ల నుంచి 5 సెంటీ మీటర్ల వరకు నిలువ ఉంచుకోవాలన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆరుతడి పద్ధతిలో నీటి తడులు ఇవ్వాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి ఈ చర్యలు తీసుకోవాలని సూచించారు.